క్లుప్తంగా

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

ఇన్‌స్పెక్టర్ కవిత



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ కవిత

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపితే ప్రమాదాలను అరికట్ట వచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కవిత, ఎస్‌ఐ దామోదర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని, సైన్ బోర్డులపై ఉన్న సూచనలు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి



రాజమ్మ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు వంగపల్లి రాజమ్మ(83) మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బైరాన్‌పల్లిలో రజకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రాజమ్మ పాల్గొన్నట్టు గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ఆమె అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

మల్లన్న ఆలయ ఏఈవోగా బుద్ధి శ్రీనివాస్



విధుల్లో చేరిన శ్రీనివాస్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఏఈవోగా బుద్ధి శ్రీనివాస్ బుధవారం విధులలో చేరారు. ఇక్కడ విధులు నిర్వహించిన వైరాగ్యం అంజయ్య ఇటీవల డిప్యూటేషన్‌పై కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌నుఏఈవోగా నియమిస్తూ దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దాసారం గుట్టను కాపాడాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలోని దాసారం గుట్టను ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడి మల్లికార్జున స్వామి ఆలయానికి అప్పగించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ సర్వే నంబర్ 305లో ఉన్న దాసారం గుట్టను కొందరు రియాల్టర్లు క్రయ విక్రయాలు జరుపుతున్నారని, దానిని ప్రభుత్వం కొనుగోలు చేసి మల్లన్న ఆలయానికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దాసరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని దుబ్బాక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లేశం అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. వెంటనే ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వామి, బాల వెంకన్న, వెంకటేశం, రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

కొండెక్కిన కొబ్బరి

- మల్లన్న ఆలయంలో టెండర్‌దారుల నిర్వాకం
- ఆదివారం రూ.50, మిగతా రోజుల్లో రూ.40
- పట్టించుకోని ఆలయ అధికారులు



కొమురవెల్లిలో ఉన్న ఒకే ఒక కొబ్బరికాయల విక్రయ కేంద్రం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొబ్బరి కాయల ధరలు కొండెక్కాయి. టెండరు దారులు నిబంధనలను విస్మరించి అధిక ధరలకు అమ్ముతున్నారు. అయినా ఆలయ అధికారులు పట్టించుకోవడంలేదని భక్తులు వాపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే కంటి తుడుపు చర్యలు చేపడుతూ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

4 దుకాణాలకు టెండర్

గత జూలైలో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ పరిసరాలలో నాలుగు కొబ్బరికాయల విక్రయ దుకాణాలకు టెండర్ నిర్వహించారు. సుమారు రూ.16లక్షలకు టెండర్ దక్కించుకున్న నలుగురు సిండికేట్‌గా మారి రీటెండర్ నిర్వహించారు. రీటెండర్ తీసుకున్న టెండర్‌దారులు తమ ఇష్టానుసారంగా ఆలయ పరిసరాలలో ఒకేఒక దగ్గర(రాజగోపురం ఎదుట) కొబ్బరి కాయలు విక్రయిస్తూ భక్తుల జేబులు లూటీ చేస్తున్నారు. కొమురవెల్లి ఆలయ పరిసరాలలో ఒకేచోట కొబ్బరి కాయలు విక్రయించడంతో పార్కింగ్ ప్రదేశాలు, ఆలయ పరిసరాలలో బసచేసే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయ అధికారులు ఒక్క కొబ్బరికాయ రూ.30లకు విక్రయించాలని నిర్ణయించారు. టెండర్ దారులు దానికి విరుద్ధంగా ఆదివారం రూ.50లకు, మిగతా రోజులలో రూ.40లకు విక్రయిస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. అయితే అధిక ధరలకు విక్రయిస్తే టెండర్ రద్దుచేసే అధికారం ఉన్నా ఆలయ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంతోంది. దేవాదాయశాఖ, ఉన్నత అధికారులు స్పందించి మరిన్ని కొబ్బరి కాయల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అధిక ధరలు వసూలు చేయడం తగదు



కొమురవెల్లి ఆలయ పరిసరాలలో కొబ్బరి కాయలను అధిక ధరలకు అమ్మడం తగదు. అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. జాతరలో ఒకే ఒక్కచోట కొబ్బరి కాయలు లభించడం విడ్డూరంగా ఉంది. అన్ని దుకాణాలలో కొబ్బరి కాయలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. – మల్లమ్మ, భక్తురాలు

సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తాం



కొబ్బరి కాయల టెండర్ దారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మాదృష్టికి ఇటీవలే వచ్చింది. విక్రయ కేంద్రాల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం. అయినా వారు తీరు మార్చుకోకపోతే టెండర్‌ను రద్దుచేసి మళ్లీ టెండర్ నిర్వహిస్తాం. – బాలాజీ, ఆలయ ఈవో

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద బ్రాహ్మణులు



భక్తులకు దర్శనమిస్తున్న శివపార్వతులు

- సందడిగా మారిన ఆలయ పరిసరాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

కొండపాక(గజ్వేల్): కాకతీయుల కాలంనాటి ప్రసిద్ధ శైవ క్షేత్రం భవానీసమేత స్వయంభూ శంభు దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది. కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలోని శంభు లింగేశ్వర సేవాసమితి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కల్యాణానికి వేలాది మంది తరలివచ్చారు. ఆలయపూజారి తమ్మలి శంకర్ దంపతులు స్వామి తరఫున, బండి కీర్తి మాధవరెడ్డి దంపతులు అమ్మవారి తరఫున పెద్దలుగా వ్యవహరించారు. 11:51 నిమిషాలకు శుభ అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన మంగళసూత్రధారణ జరిపించారు. కల్యాణం అనంతరం శివపార్వతులకు మహిళలు ఒడి బియ్యం, పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. రాత్రి శివపార్వతుల ఊరేగింపుతో మూడు రోజుల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కల్యాణానికి హాజరైన జెడ్పీచైర్ పర్సన్ దంపతులు వేలేటి రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీ గురజాడ బాలాజీ, లింగేశ్వర సేవా సమితి సభ్యుడు అనంతుల నరేందర్, మంచాల శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి కృషి మరువలేనిది

మాల మహానాడు నేతలు



చేర్యాల(సిద్దిపేట): పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రమాబాయి అంబేద్కర్ కృషి మరువలేనిదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ కొనియాడారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రమాబాయి అంబేద్కర్ చిన్న వయసులోనే ఐదుగురు పిల్లలకు తల్లై వారి ఆరోగ్యం క్షీణించి చనిపోతున్నా తాను పనిచేస్తే వచ్చే డబ్బును అంబేద్కర్ చదువు కోసం ఖర్చు చేసిన గొప్ప వనిత అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట రాజు, పుట్ట యాదయ్య, బుట్టి బాలయ్య, భాస్కర్, ఐలయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి కార్యక్రమాన్ని పీవీ నర్సింగారావు సేవా సమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మరాఠీ మణిదీప్ రమాబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కఠిక పేదరికాన్ని అనుభవించినా అంబేద్కర్ ఆశయ సాధనకు సహకరించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎలగందుల శంకర్, మైల తిరుపతి, వెల్పుల రాజు, మహేశ్, పవన్, లింగచారి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ మెప్పు కోసమే మైనంపల్లి తాపత్రయం

బీఆర్ఎస్ నేతల విమర్శ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటజోన్: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సీఎం రేవంత్‌రెడ్డి కోసం తాపత్రయ పడడం తప్ప వేరేమీ కాదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ మైనంపల్లి ఏ హోదాలో సిద్దిపేటలో పర్యటించారని ప్రశ్నించారు. రాజకీయాల్లో రౌడీయిజం పనికిరాదని, ప్రశాంతంగా ఉండే సిద్దిపేటలో ఫ్యాక్షనిస్ట్ తరహాలో కొత్త డ్రామాలు కుదరవన్నారు. కాంగ్రెస్ నేతగా ప్రభుత్వ విధానాల గురించి చెప్పకుండా హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మైనంపల్లి గతం గుర్తు చేసుకోవాలని హితబోధచేశారు. మంగళవారం ర్యాలీ క్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు అక్బర్‌పై జరిగిన దాడిని వారు ఖండించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు వెళ్లే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వజీర్, మాజీ కౌన్సిలర్ మోహిజ్, నాయకులు మహేశ్, ప్రభాకరరెడ్డి, అక్బర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'స్వయం స్వపరిపాలన'



అల్వాలలో పాల్గొన్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక ప్రాథమిక పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలవురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కొందరు అధికారులుగా వ్యవహరించి అలరించారు. అల్వాలలో విద్యార్థులు స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హెడ్‌మాస్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, టీచర్లు అనసూయ, అనిత, శ్రీనివాస్, వెంకట నర్సింహులు బహుమతులు ప్రదానం చేశారు.

చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు ఎంపీపీఎస్‌లో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులుగా ప్రతిభ చూపిన వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజ్వేల్ ఏసీపీ రమేశ్



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

ములుగు(గజ్వేల్): విద్యార్థినులు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏసీపీ రమేశ్ అన్నారు. ములుగు మండలం సింగన్నగూడ ఉన్నత పాఠశాలలో బుధవారం వివిధ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగలమని చెప్పారు. మహిళలు, బాలికల రక్షణ గురించి ప్రత్యేకంగా షీ టీంలను ఏర్పాటు చేశారన్నారు. సైబర్‌నేరాలు, బాల్య వివాహాలు, సోషల్‌మీడియా వల్ల జరిగే నష్టాలు, లాభాలు తదితర అంశాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్, హెచ్‌ఎం అబ్దుల్ రహీం, షీటీం బృందం పాల్గొంది.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం ఎస్‌ఐ నాగరాజు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

కొమురవెల్లి(సిద్దిపేట): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ బాగా పెరిగిందని, దానితోనే మనిషి మనుగడ ముడిపడి ఉందన్నారు. అయితే దానిని సక్రమంగా వాడుకోవాలని, అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దని చెప్పారు. ఆ నేరస్తుల వలలోపడి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు పంపించే బ్లూ కలర్ లింక్‌లు, ఫోన్‌కాల్స్‌ను కూడా లిఫ్ట్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అపరిచితులతో స్నేహం చేయొద్దు

రాయపోలు(దుబ్బాక): ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని రాయపోలు ఎస్‌ఐ రఘుపతి సూచించారు. మండలంలోని రాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో స్నేహం చేయొద్దని సూచించారు.

టెక్నాలజీని మంచికి వినియోగించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం బాగా పెరిగిందని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే మెసేజ్‌లకు స్పందించవద్దని, డబ్బు ఎరచూపే ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే 1930 కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

ఏఎస్‌ఐ శంకర్‌రావు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరికీ ఎటువంటి ఓటీపీలు చెప్పవద్దని, అలాంటి కాల్స్ వచ్చినపుడు 1930కు గాని, 100కు గాని డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య, అంజయ్య, బాల్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ఎస్‌ఐ చంద్రమోహన్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని కోరారు.

చేర్యాలలో..

మండల పరిధిలోని గుర్జకుంట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఎస్‌ఐ ఓ.దామోదర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. జాబ్స్, ఆఫర్లు, బహుమతులకు ఆశపడవద్దని చెప్పారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎస్‌ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలుపై సమీక్ష



నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కేంద్ర కమిటీ సభ్యుడు సమీర్‌కుమార్, ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి అశోక్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, డైరెక్టర్ రాహుల్ సింహ, ఎకనామిక్ సెక్షన్ అధికారులు నీలిమామీర్జా, ప్రతిభ తొప్ప, స్టీల్ సెక్షన్ అధికారి ఎం.సునీత బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కస్తూర్బా గాంధీ, అంగన్‌వాడీ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల, తహసీల్దార్ శ్యాం, ఎంపీడీఓ రాము, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ నాయకుడు ఎల్లయ్య



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌కు బుధవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి, యాదగిరి, కుమార్, కృష్ణ, వినోద్, సురేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణరెడ్డి



సీపీ అనురాధను కలిసిన సత్యనారాయణరెడ్డి

సిద్దిపేటకమాన్: ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, పోలీసు కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణరెడ్డి సీపీ అనురాధను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె అభినందించి జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. కమిషనరేట్ పరిధిలో పేకాట, జూదం, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సీపీ సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ 15వ తేదీ వరకు గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి, దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ వందరోజులు పని కల్పించాలి: డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య

కోహెడ(హుస్నాబాద్): ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయితీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులపై చర్చించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీఓ మధుసూదన్‌ను ఆదేశించారు.

◆ 30 శాతం నిధులు కేటాయించాలి : ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు సంజీవ్ కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ కోరారు. బుధవారం తమ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కొఠారి కమిషన్ సిఫార్సు చేసిన విధంగా నిధులు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

◆ నిరాధార ఆరోపణలు తగవు: కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు

కోహెడ(హుస్నాబాద్): కోహెడలోని సర్వే నంబర్ 1306ఏ, 1307ఏ, గల 9.09 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య తహసీల్దార్‌కు చేసిన ఫిర్యాదుపై కోహెడ ప్యాక్స్ చైర్మన్ పెర్యాల దేవేందర్‌రావు స్పందించారు. తప్పుడు నిరాధార ఆరోపణలుచేసి తన గౌరవ ప్రతిష్టలకు భంగం కల్పించారని వాపోయారు. సమగ్రమైన విచారణ చేయాలని తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తామన్నారు.

◆ లైబ్రరీల ఏర్పాటే లక్ష్యం

గజ్వేల్: ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు టీవైఆర్ ఫౌండేషన్ అధినేత టి.రాజు చెప్పారు. బుధవారం గజ్వేల్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో అహ్మదీపూర్, చేబర్తి, మజీద్‌పల్లి, బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు లైబ్రరీ సామగ్రి, బీరువాలను అందజేశారు. కార్యక్రమంలో టీవైఆర్ ఫౌండేషన్ సంస్థ వైస్‌చైర్మన్ విజయలక్ష్మి, కోఆర్డినేటర్ అజయ్ పాల్గొన్నారు.

◆ గృహజ్యోతికి అనుసంధానం

కోహెడరూరల్(హుస్నాబాద్): గృహ జ్యోతి లబ్ధిదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డులు, సెల్ నంబర్‌లను విద్యుత్ మీటరు నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని డీఈఈ శ్రీనివాస్ సూచించారు. కోహెడ, సముద్రాలలో గృహలక్ష్మి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

◆ ఓపెన్ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పెంపు

సిద్దిపేట ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల్లో అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ పొందడానికి గడువు పొడిగించినట్లు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 73829 29615 నంబర్‌కు ఫోన్‌చేసి సంప్రదించాలన్నారు.

◆ సెల్‌ఫోన్‌పోతే రిజిస్ట్రేషన్ చేయాలి

సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వాటి వివరాలను వెంటనే నూతనంగా వచ్చిన సీఈఐఆర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి తెలిపారు. సీపీ కార్యాలయంలో సిబ్బందికి బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ యాప్‌లో సెల్‌ఫోన్‌వివరాలు నమోదు చేయడం ద్వారా దానిని పట్టుకోగలమని చెప్పారు.

◆ పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: పశువుల పెంపకంలో పాడిరైతులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజ్ఞాపూర్ పశువైద్యాధికారి జీవిత సూచించారు. బుధవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రిమ్మనగూడ పశువైద్యాధికారి శిరీషతో కలిసి జీవిత మాట్లాడుతూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని, పశువులలో మార్పులు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలని సూచించారు. పోషకాలతో కూడిన పశువుల దాణాను పాడిరైతులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతయ్య, మహేందర్, చరణ్, స్వామినాథ్, ఇస్తారి, శంకర్, శ్రీధర్‌తో పాటు గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.